

# ప్రాక్కం

**దిక్కుమాలిన**వాంయిసొచ్చి పడిపోనాది మీద.

బొత్తిగా కదల్లేకుంటున్నాను.' తనని తను తిట్టుకుంది, పుగతోటల్లో పని చేసి "సంద లడినాక" ఇంటికొస్తూ దారిలో పిల్ల బోది దాటుతున్న నూకాలమ్మ. బోది రెండు గజాలకంటె వెడల్పు లేదు. బోదిలో నీరూ ఎక్కువ లేదు. రెండు తాటి పట్టెలతో రెండు ఒడ్డులనీ కలువు తున్న వంతెన మీద కాలీ 'టిపినీ' కుడిచేత్తో పట్టుకుని, ఎడం చెయ్యి బారజాచి జాగ్రత్తగా 'సర్కసులో గడసాని' లాగా బాలెన్సు చేస్తూ బోది దాటింది.

'ఏ టప్పుడే చీకటడిపోనాది.'

ఆకాశం కేసి చూసింది. నీరెండలు కన్పించేయి. కాని వెలుగు తగినంత లేదు. బలవంతాన బళ్ళో కెడుతున్న గుంటడి మొహంలా కాంతిహీనంగా ఉన్నాడు సూర్యుడు.

"వోలమ్మో! కుర్ర దొకత్తున్నా దింట్లోను. అసలే పచ్చి బాలింత్రాలు, చంటి గుంట ఏ మేడిపింతందో.

చిట్టి గుర్తుకు రాగానే నూకాలమ్మ నడక వేగం హెచ్చించింది. చిట్టి ఆమె సొంత బిడ్డ కాదు. పదిరోజుల పిల్లని చెల్లెలు పోమాలమ్మ ఒడికట్టులో పడేసి తన దారి తాను చూసుకోగా, పిల్లని పెంచి పెద్ద చేసింది 'పుట్టేదవరాలు' నూకాలమ్మ.

ఎవరో జడదారి తపసు పాడు చెయ్యడానికి మరెవరో పదవీ వ్యామోహపరుడు ప్రయోగించిన మదనాస్త్రం ఫలితంగా పుట్టిన శకుంతల



_రాయప్రోలు హైమ

కణ్వుడికి ఆట్టే కష్టం లేకుండా మంచి రాజును చూసి 'గాంధర్వం' ఆడేసింది.

కాని, మగ దిక్కు లేని నూకాలమ్మ, రెక్కాడితే కాని డొక్కాడని నూకాలమ్మ కష్టపడి పదహారేళ్ళ పాటు పైసా పైసా కూడబెట్టిన రొక్కం మొత్తం మూడు వేలు ఖర్చు పెట్టి చిట్టికి జంమ్మంటూ పెళ్ళి చేసింది. అల్లుడి ఖరీదు శక్తికి మించినదే అయినా గుంట దాని భవిష్యత్తాలోచించిందామె. అప్పారావు లారీడ్రైవర్. బలంగా అందంగా, ఉన్నాడు సొట్ట బుగ్గల చిట్టిని చూడగానే 'నచ్చిం' దన్నాడు. కట్నం గురించి రొక్కించొద్దని తల్లికీ, తండ్రికీ చెప్పేసేడు.

'అయితే...నానేటి తక్కువ జేసినానూ'... అనుకుంది. ఒంగునిచేలోంచి నాలుగు పచ్చిపెసరకాయ లందుకుంటూ నూకాలు. "వెయ్యిన్నూట పదార్లు కట్నం... అరతులం ఉంగరం... తక్కువేం కాదు. పైగా పిల్లని పంపేటప్పుడు దిసబొమ్మ లాగా పంపినానా! బుట్ట జువకాలు... చెంపసరాలు... ముక్కు పుడకలు... పట్టీలు... అన్నం తప్పేళా... నవారు మంచం... స్టీలు కంచం... అబ్బో...

జమీందారింటాడ పిల్ల నంపినట్టు కాపరాని కంపింది చిట్టని. "ఏదో. దానమ్మ దాన్ని బూమ్మా నొగ్గీసి తను బూమిలో కల్సిపోయినందుకు అమ్మనీ, బాబునీ నానే అయినాను. పెంచినాను. ఒక ఇంటి దాన్ని జేసినాను. ముగ్గురు పిల్లల తల్లి కూడా అయింది చిట్టి...

తృప్తిగా ముక్కెగ బీలుస్తూ పెసరకాయ ఒల్చి గింజలు నోట్లో పడేసుకుంది నూకాలమ్మ. గంగాలమ్మ తల్లి పుణ్యాన చిట్టి కానుపు సుఖంగా అయిపోయింది.

"చెంద్రబింబం వాగున్నాది పిల్ల." అప్పారావు పురిటి నీళ్ళనాడు కూతురి మొహం నూనెలో చూసుకుని మురిసిపోయేడు. అంతకంటే తన కింకేం కావాలి. పది రోజులు వోపిక పడితే చిట్టి తనింటికి నెళ్ళిపోతుంది.

'అప్పుడు నా కిం కేటురటాది బరువు' తేలికగా నవ్వుకుంది ముగ్గురు చంటి పిల్లలతో సతమతమయ్యే చిట్టి బ్రతుకుతో ముసలి, ఒంటరి బ్రతుకు, తన బ్రతుకుని పోల్చుకుంటూ నూకాలమ్మ.

అయినా కూతురి పురుడో పెద్ద బరువా... చెట్టుకాయ చెట్టుకి బరువా?

'అయితొకటున్నాది.' ఏదో ఆలోచించబోయి మరింకేదో వైపుకి మనసుని పోనిచ్చేసింది.

"మూడో పురుడు పుట్టింట్లో పోసుకునే రివాజు లేదు. తనే బలెంతంగా రివాజు తప్పించేసింది. అప్పారావు కొత్త కుర్రాడు. ఇద్దరు కొడుకులతో సరిపెట్టేసుకుని 'ఆపరేసను' చేయించీసుకుంత నన్నాడు కాని తనే ఇంకో కానుపు చూడమని బతిమాలింది.

"ఏపెలాగున్నా ఆడ గుంటందం ఎన్నాళ్ళుండనిది కష్టమొచ్చినా సుకమొచ్చినా, రేపు నచ్చినప్పుడు మీద పడి ఏడవాలన్నా, కూతురి సాటొస్తాదేటి కోడలు"... అని నచ్చ చెప్పింది. అదీ కాకుండా మూడు తరాల కోపాలన్నా 'కన్యాదానం' సెయ్యకుంతె పెద్ద లెల్లా తరిస్తా" అని కొడుకుని బలవంతం చేసింది అప్పారావు తల్లి.

"పురిటి పరుసుకి జడ కల్లుడూ—నీ కే ఇబ్బందీ నేకుంట నీ బారియాని నాన్నీసుకెల్లి పురుడో సంపుతాన్నాయన్నాయన. కాదనకు." నూకాలమ్మ పూచీ పడింది.

అప్పారావు సరే నన్నాడు.

'ఈ పాలికూడా మగ్గుంట డుడితే మనం చేసేదేటీ నేదు. కాని గంగాలమ్మ తల్లి కనికరించి నాది' అనుకుంది కాలిబాటలో అడ్డొచ్చిన మట్టి దిబ్బ దాటుతూ. దిబ్బ మీద దుబ్బుగా పాకిన గుమ్మడి తీగ కాలికి తట్టుకుని పడబోయి ఆపుకుంది.

"ఏటలాగ ఎర్రి సూపులు సూస్త నడుస్తున్నావు, నూకాలప్పా!" ఎక్కణ్ణుంచో గేదెల రాములు గొంతు వినిపించింది. నూకాలమ్మ ముందు, వెనక కలియజూచింది.

"ఇదిగో... ఇక్కడ. కుడి చేతివేపు చూడేస్!" పెసర చేనుగట్టు మీద పాకిన కాకరపాదు వెతికి వెతికి కాయలు కోస్తున్నాడు రాములు. "ఇలా రమ్మా."

"ఎల్లిపోవాల." నసుగుతూ వాడి వేపు నడిచింది.

"అందరమూ యెల్లిపోయావోల్లమేలే." పెద్ద వేదాంతిలా మొహం పెట్టి నవ్వాడు. అస లంతే వాడు. మాటకి ముందు వేదాంతం చెబుతాడు. నూకాలమ్మకి తమ్ముడూ కాదు, తాటిపట్టీ కాదు. ఏదో దూరపు చుట్టరికం ఉందని తనే నిరూపించి "నూకాలప్పా" అని పిలుస్తుంటాడు. కాని నూకాలమ్మ మాత్రం "రాములు గోడింటి పెరటో ల్లెవరూ మా సుట్టాల్లో లే" రంటుంది.

"తన మేనమామ కూతురు పోలేరమ్మ అడబడుచు మొగుడు సుబ్బయ్య" కి నూకాలప్ప...

"చస్. ఆ ఒరసలన్నీ నే నిన్లేను. నాకు తల్సొప్పి. అందరమూ అప్పలమే—అందరమూ తమ్ముళ్ళమేలే. నీ కెప్పుడయినా కూరా కువమ్మా కావాలం తొడిగొట్టు కెల్లిపో— దిక్కు మొక్కు లేని ముసిలోడివి."

అంతే! అప్పట్నుంచీ 'నూకాలప్పా' అన్న పిలుపు ఖాయం చేసేసేడు రాములు. "అల్లప్పు డెప్పుడో తుపా నొచ్చినప్పుడు ఆడి పిల్లా పాపా నచ్చిపోనారంత. గుండికాయ పెదిరి పోయి మూ రొచ్చేసి నాడు. ఆరి దగ్గరా ఈరి దగ్గరా గొడ్లకాపలాకి కుదురుకొని తలకో రెండు రూపాయ లిస్తే నెలకి సరిపడ బియ్యం కొనుక్కుంతడు. అచ్చియ్యమ్మ పంచలో ఉడకేసుకుని తిని నులక మంచంలో తొంగుని తంబళ్ళ పదాలు పాడతడు" అంటుంది నూకాలమ్మ తన ముసలి తమ్ముణ్ణి గురించి.

"ఏట్రాములూ! దిబ్బమీదేటున్నాయేటి.ఎగిరెగిరి నెతుకులాడు తున్నావు.కాకరకాయులంటే నా టిపినీలో కూడా కూ నొడెంయిమా! రేపు ఇగురొండి నీకో ముక్కెస్తాన్లే!"

రాములు పైన మీద గుడ్డ నేలమీద పరిచేడు. ఒక వైపు రెండు చెంగులు కలిపి ముడేసి సంచిలా తయారు చేసేడు. నేల మీద కుప్పగా కోసిన కాకరకాయ లందులోకి ఎత్తాడు. గుడ్డ 'సంగాం' బుజాన వేలాడేసుకుని— "నణ్ణడు! నేనూ అటే వత్తన్నాను. మీ గుమ్మంలో నాగి ఇస్తాన్లే" అంటూ




ఇద్దరూ గూడెం వేపు బయలుదేరారు.

'దిబ్బిగదలగ! కక్కు ముక్కలు తినీ రోజులు పోనాయి. కాసరకాయలు తినీ రోజు లొచ్చినాయి.' మనసులో అనుకోబోయి పైకి అనేసేడు రాములు.

''మరేమిటి చేస్తం. రోజులు మాడిపోతుంతే'' అంది నూకాలమ్మ. పిచ్చాపాటీ మాటాడుకుంటూ గూడెం దగ్గర కొచ్చారు. నూకాలమ్మ గుడిసె ముం దాగి గుడ్డ మంగాంలో కాసరకాయలు ఆమె ఒడిలో వెలిపేడు రాములు.

''మరుంటానప్పి. రాత్తిరికి ఈరబ్బాయిగారి కత పాడతాను. ఇందువు గనటే. ఎలిపోయి రవిమ్మ.''

''అప్పి'' అని ఆత్మీయత ఉట్టి పడేటట్లు పిలవడమే కాదు, ఎక్కడెక్కడి పురాణ గాథాూ చెప్తుంటాడు. కథలు చెపుతాడు. పాటలు వినిపిస్తాడు. మధ్య మధ్య అణా బేడా అప్పు, అప్పులోకి ఆధరువు అడిగి పట్టుకు పోతుండటంకూడా రాములుకి మామూలే.

''అలా గొస్తన్నే.'' గుమ్మం వేపు నడిచింది నూకాలమ్మ.

టయిమింకా ఆరయినట్టు లేదు. ఆకాశంచీకటికోక కట్టేసుకుంటోంది. వెలిసి పోయిన కలంకారీ చీర మీద ప్రింటు లాగ అక్కడక్కడ నక్షత్రాలు తళతళ్ళాడటానికి ప్రయత్నిస్తున్నాయి. గుడిసెలో ఎక్కడా అలికిడి లేదు సరికదా తలుపు సందులోంచి దీపం మినుకు మినుకుకూడా కనిపించడం లేదు.

''ఏటీ పిల్లె టెల్నాదీ...'' తలుపు గెంటింది నూకాలమ్మ.

''ఎటూ ఎల్నేదు. గట్టిగా గెంటు తలుపు.'' పిల్ల నోట్లోంచి రొమ్ము మార్చి రెండో రొమ్ము దోపి అట్నుంచి ఒత్తిగిలింది చిట్టి.

''కీచు కీచు'' మంటూ చటిది కంగారుగా పాలు పీలుస్తుంటే ఆ చప్పుడుకి చిట్టి మంచం ఫలానా దిక్కునుందని తెలుస్తోంది కానిమామూలుగా గుడి సంతా చిమ్మ చీకటిగా ఉంది.

''అదేమి! చీకట్లో తొంగున్నారు అమ్మా— కూతుళ్ళు, దీప మెలిగించనేదా?''

తడుముకుంటూ వెళ్ళి 'టిపినీ'ని ట్రాటకి కొట్టిన మేకుకి తగిలించి దీపం బుడ్డికోసం వెదుకులాట మొదలు పెట్టింది.

''ఎందు కెతుకుతావు? కిరసనూన్నేదు...''

''అదేమి! కొట్టు మీనకెల్లి తెమ్మన్నాను. డబ్బులిచ్చి నాను కాదా! తేనేదా! అడియ్యనేదా...'' కొడుకులిద్దర్ని అత్తగారి దగ్గ రుంచేసి పురిటి కొచ్చిన చిట్టి ఇక్క డున్నన్ని రోజు లయి అమ్మని సుఖ పెడదామని సదుద్దేశంతో నూకాలమ్మ పన్లోకి వెళ్ళిపోయేక ఇంటిపనీ వంటపనీ తనే చక్కబెడుతోంది—అప్పుడప్పుడు గౌరి గుక్కపెట్టి ఏడ్చినప్పుడు తప్ప.

''మూడు గంటల కాణ్ణించి నాలుగున్నరదాకా కిరసనూనిచ్చినాడంత. కానప్పుడే గౌరమ్మ తల్లిని కండ చీమ పొటుక్కున పొడిచినాది. పిల్ల కంకటిల్లిపోతుంటే పూరుకోబెట్టి నర్సమ్మ పెద్ది కప్పజెప్పి నాను కొట్టుమీన కెల్లినాను. అదు టయిమయి పోనాది పొమ్మన్నాడు.''

''బాగుం దొరవ ...''ఇంకేమనాలో తోచలేదు నూకాలమ్మకి.

''పానీ బుచ్చియ్యమ్మ పెద్ది నడిగి ఒక బుడ్డె డాట్రాపోనావా?''

''ఆరకీ దొరకనేదు కిరసనూని. ఆలు కూడా సందోకట్లోనే కూడు తినేసి తొంగుడున్నారుచూడు. నువుకూడా బేగి కూడు తినీకూడదా?'' పిల్లపక్కలోంచి కదలకుండా పూరి విశేషాలన్నీ చెప్పమంటే ఎంచక్కా చెపుతుంది చిట్టి.

నూకాలమ్మ మాటాడలేదు. గుడిసె బయటి కొచ్చి నడివాకిట్లో నిలబడింది. ఇరుగు పొరుగిళ్ళలో ఎక్కడా దీపాలు వెలుగుతున్న జాడ లేదు. ఎక్కడో దూరంగా ఉన్న రెండు మూడు లోగిళ్ళలో మాత్రం ఎలక్ట్రిసిటీ దీపాలు వెలుగుతున్నాయి. అలికిడి కూడా అంతంతమాత్రంగానే ఉంది.

''పూరుమాటుమణక్కుంట తొంగున్నారేటల్లా...

గుడిసె లన్నింట్లోకీ దూరింది నూకాలమ్మ గొంతు. కానీ వెంటనే ఎవరూ పలకలేదు.

గవరమ్మ అడ్డపుగ బిగించింది. నోరిప్పి మాట్లాడ్డానికి బద్ధకం వేసింది. లచ్చయ్యమ్మ వీపుకి ఏరు పిడకల కుంపటి వెచ్చదనం తగుల్తుంటే ఆ హాయి ఒదులుకొని బయటికి వచ్చి ఎవరితోటీ మాట్లాడటాని కిష్టపడదు. మొగుడి డొక్కలో కంటా దూరి పోయి తొంగున్న అమ్మాజమ్మకి కదల బుద్ధి పుట్ట లేదు. పెదవి మెదప బుద్ధి పుట్ట లేదు.

బుచ్చియ్యమ్మ క్షయ దగ్గు మొగుడి కాళ్ళకి మంచినూనెరాసి మర్దనా చేస్తోంది. నోట్లో చుట్ట తీసి నేలకిరాసి పక్కన బెట్టిందీ తుపుక్కున అరుగు కిందకి పూసింది.

''ఎవలమి తొంగుడో లేదు, నూకాలప్పా! అంతా మెలుకూగానే ఉన్నాం. అయి నిప్పుడప్పుడేం తొంగుంతాం ...''

''ఏటి మీకూ కిరసనూనియ్య నేదా...''

చవక దుకాణం గవర్రాజుతో గూడెం వాళ్ళంతా తగువులాడినా రేమోనని అనుమానం వచ్చింది నూకాలమ్మకి.

''అడెందు కిస్తాడూ ... అడి జిమ్మ లాగ ... గంటసేపు 'క్యూ'లో నిలబెట్టినాక టయిమయి పోనాది పొమ్మన్నడు.'' మరోసారి పూసింది బుచ్చియ్యమ్మ అరుగు కిందకి.

''సరుకయి పోనాదేమో...''తేలిగ్గా ఎవర్నీ అనుమానించ లేదు నూకాలమ్మ. ''నిజంగా సరుకుంటే


2వ సారి సాహిత్య అకాడమీ బహుమతి గెల్చుకొని వాసిగాంచిన
వాసిరెడ్డి సీతాదేవి రచనలు

సావేరి (సినీ జీవితాల, విచిత్ర వింత ఘోరాలు అబల గాథ) 12.00
మరీచిక (హిప్పీయిజమా? విప్లవమా? నేటి యువతరం ఏవైపు మొగ్గుతోంది!) 12.00
మరో కర్ణుని కథ (తండ్రి ఎవరో తెలియని తనయుని వింత గాథ) 12.00
ప్రతీకారం ('మనస్సాక్షి' సినిమాగా రూపొందిన నవల) 6.00
మళ్ళీ తెల్లవారింది (కన్నడ భాషలోకి అనువదించబడిన గొప్ప కుటుంబ నవల) 6.00

అన్ని పుస్తకాల షాపుల్లోనూ దొరుకుతాయి. వేరా కోరిన పుస్తకాల మొత్తంలో 1 రూపాయి తగ్గించి M.O. పంపండి. ఆ రూపాయికి V.P.P.లో పంపుతాము.

నవజ్యోతి పబ్లికేషన్స్ ఏలూరు రోడ్, విజయవాడ- 520002

అమ్మకుండ ఆశ్నత్తినేసి * కొట్టుకుంటా డేటి."

"సరుకెందుకు నేదు. బాకులోనయితె యిస్తా నన్నాడు. రెట్టింపు దరెట్టి మన్నాటోళ్ళు కొనగల రేటి బాకులోన ..." అమ్మాజమ్మ చీర సవరించుకుంటూ పొట్టి గుమ్మంలోంచి బయటి కొచ్చింది.

"నూకాలప్పా! నీ మొకం చూసూరుకుంతన్నాం. శేపొతీపాటికి ఆ గవర్రాజు గోడి ఇల్లు పీకి పందిరేసే వోళ్ళమే. బాకులో నమ్ముతాడా కిరసనూని బాకులోన..." పులిలా గాండ్రించింది అమ్మాజమ్మ.

"మనందరికీ కాడ్లున్నాయి కదే, అమ్మాజమ్మా! బాకులో నెందు క్కొనుక్కుంతమూ?" ధర్మ సందేహ మొచ్చింది నూకాలమ్మకి.

"'ఎల్లడుగు నీ గవర్రాజు తమ్ముణ్ని. మన ల్నడుగుతావేమీ. కాకపోతే ఆడప్ప పంచాయితీబోర్డు లెంబరు. అప్పయ్యమ్మ నడుగు, అమ్మాజమ్మకి కోపం నసాళం అంటిపోతోంది గవర్రాజుమీద. 'ఎదవబుద్ధి. దొంగేపారంలో సంపాదిస్తన్నాడుగందాని ఏ యాడదాన్ని పడితె ఆ యాడదాన్ని కబురంపేడమే."

"'మనందరి కాడ్లు మీనా సరుకిచ్చేసినట్టు గీకేసికుంతడు. మళ్ళీ మన సరుకే మనకి బాకులో నమ్మిస్తడు— ఎదవెదవెదవ ... ఎప్పుడో బోర్లా పడకుండుంతడా."

నూకాలమ్మకేసి మెటికలు విరిచి గుడి సెనకాల కాలు మడుచుకోడాని కెళ్ళిపోయింది అమ్మాజమ్మ.

నిర్ఘాంతపడి నిలబడి పోయింది నూకాలమ్మ. కాళ్ళు కడుక్కుందామని చెంబుతో ముంచిన నీళ్ళు అలాగే పట్టుకుని గుడ్లు మిటకరించింది.

"నా సంగ తేటయ్యిందా...మొన్న ముసలాయన బొంబిడాయ లిగురు కావాలన్నాడు. మన మెల్లాగా బెల్లపు 'టీ'యే తాగుతాం గందావి, చేతిలో డబ్బుల్లేక, రెండు రూపాయల కాడికి ఎగష్ట ఇస్తానంటే నా పణద్వార కాడ్డు పాస్పి పాపు పోలయ్య కిచ్చినాను. ఆనా కొడుకేం జేసినాడంతె...పణదార, కిరసనూని, రేసను బియ్యం అన్నీ పుచ్చేసుకుని 'దిసకాడ్డు' నా మొగాన కొట్నాడు." వాపోయింది బుచ్చియ్యమ్మ.

"దేము డొర మిచ్చినా పూజారాడు అడ్డెట్టేస్తున్నాడు. డబ్బున్న వోడు కరెంటు దీపాల్తో కులుకుతుంతె, మన్నాటి బీదా బిక్కీ కిరసనూని దీపాలక్కూడా నోచుకోకుంటున్నాము..."

స్వగతం చెప్పుకుంది నూకాలమ్మ. రాయిమీద నిలబడి చీరెగ్గట్టి, కాళ్ళు, చేతులు కడుక్కుంది. కుండలో చల్లటి నీళ్ళతో మొహం పామి పామి కడిగింది. మూడు పురిషెళ్ళు పుక్కిలించి పూసి గుడిసెలోకి నడిచింది.

మళ్ళీ చిమ్మచీకటి. నిశ్శబ్దం. చంటి పిల్ల పాల పీల్పు కీచు కీచు. చిట్టి గుర్రు.

'కరెంటు దీపాల్లో ఉండొచ్చిన పిల్ల నా యింటికా డె లాగ చీకట్లో తొంగుడున్నాదో!' కడుపు చెరుతయిపోయింది నూకాలమ్మకి చిట్టిని చూపి.

"మాయదారి తల్లిని నేను బతికేం! చచ్చేం. పురటాల్ని చీకట్లో నుంచీసినామ" అనుకుంది.

నెమ్మదిగా అడుగులు నేల రాస్తూ నడిచి చేతులు రెండూ ముందుకి చాచి, నిట్రాటకున్న మేకునించి నూనెకాయ తీసింది. అలాగే కుడిచేతి వేపున్న అమ్మోరి పెట్టె దగ్గరకెళ్ళి అరలోంచి మట్టి ప్రమిద తీసింది. కట్టుకున్న పాత చీర కొంగు చించి నలిపి వత్తి చేసింది. ఉన్న రవంత నూని ఒలికిపోకుండా ప్రమిదని అరచేతిలో పెట్టుకుని పోసింది. అగ్గిపెట్టె తీసి పుల్ల గీసింది.

గోరంత మావె దీపం గుడి సంతా వెలుగు జిమ్మింది. నూకాలమ్మ మొహం విప్పారింది. 'అమ్మోరుపెట్టె' మీద ప్రమిద ఉంచి, చిట్టి మంచం దగ్గర కొచ్చింది.

తల్లి డొక్కలో దూరిపోయి నిద్దరోయింది రెండు నెలల గౌరి. వెల్లకిల పడిన కప్పలాగ లేత కాళ్ళు రెండు చాచి, చేతులు గుండెమీద పెట్టుకుంది. నయాపైసంత నల్లబొట్టు మెరిసిపోతోంది. లేత గులాబీ రెమ్మలాగుంది పిల్ల. చిట్టికి ఒంటిమీద తెలివి లే దసలు. జాకట్టు గుండీలన్నీ వూడిపోయి, పిల్లకి ఆకలేసినప్పుడల్లా పాలు చీకడానికి వీలుగా ఉంది. గజ్జెల పట్టీలు దుబ్బు కాళ్ళని ప్రదర్శిస్తూ చీర లుంగ జుట్టుకుని పోయింది.

'ఎర్రితల్లి...ఎర్రిపిల్ల...ఎలా తొంగున్నారో.' మతారంగా గౌరి చెంపలు తాకింది నూకాలమ్మ. మనసు తేలిక పడ్డట్టయి, ముసి ముసి నవ్వులు నవ్వుకుంటూ అన్నం తప్పేళా ఉట్టిమీదనుంచి దించింది. గిన్నెలో అన్నం పెట్టుకుంది. అమ్మోరి పెట్టె దగ్గర కూచుని ప్రమిద వెలుగులో 'సొరన్నం, వర్రగుండ కలిపింది. ముద్ద నోట్లో పెట్టుకోబోయింది—అంతే.

'అమ్మో! ఇదే టిలాగ! పిల్ల తల దిక్కున మూస్దిప మెట్టినాను.'

కంగారుగా గిన్నెలో చెయ్యి కడిగేసుకుని ప్రమిద తీసి దూరంగా పెట్టేసింది. శంకించే స్వభావం కాకపోయినా, తల్లి మనసు నూకాలమ్మది. గిన్నె కడిగేసి బోర్లించింది. తప్పేళాలో మిగిలిన అన్నం జాగ్రత్తగా మూత పెట్టి ఉట్టెమీద పెట్టేసింది. మంచం వాల్చి పాత బరకం పక్క పరుచుకుంది. పీను తలగడమీద తలపెట్టి నడుం వాల్చింది.

విద్ర పడితేనా! మాయదారి ఆలోచనలు! ఒకటా! రెండా! రోజు రోజుకీ రోజులు గడ్డయి పోతున్నాయని ఆలోచన. ధర లిలా మండిపోతుంటే జనమెలా బతుకుతారని దిగులు.

తన చిన్నప్పు డెలాగుండేది! ఆరు కాన్ల కిరసనూని కొంటే నెల్లాళ్ళపాటు హాయిగా ఇంట్లో దీప ముండేది. పావలా సంత చేస్తే చాలు వారం


# మీకు సమస్యలున్నాయా?

మీ సాంఘిక సమస్యలన్నింటికి "వ్యవహారదర్శిని" అనే తెలుగుపుస్తకంలో పరిష్కార మార్గాలున్నాయి. అంటే ఏదైనా ఆస్తికొనేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏదైనా ఉత్పత్తి, వ్యాపారం చేయాలంటే దేనికెవరివద్ద ఎలా లైసెన్సు తీసుకోవాలి, వివిధ జాతుల వివాహ, విడాకుల నిబంధనలు, ఆస్తిహక్కులు. ఎవరివల్లనైనా ప్రమాదంరాబోతుంటే పోలీసురక్షణకు ఎవరికెలా వ్రాసుకోవాలి, ప్రభుత్వఉచిత యిండ్లస్థలాలు పొందటానికి ఎవరికెలా ధరఖాస్తు వ్రాసిపంపుకోవాలి, నోట్లు, దస్తావేజులు, ఒప్పందాలు, పత్రాలు, పిటీషన్లు, ఫిర్యాదులు, ఉత్తరాలు ఎలా వ్రాయాలి, వాటివివిధ నమూనాలు, అనేకముఖ్య చట్టాలవివరాలు, యిలాంటివెన్నో మీలావాదేవిల పరిష్కారానికుపయోగపడేలా చక్కగా వ్రాయబడ్డాయి. 300పేజీలపుస్తకం. వెలరూ: 12. పోష్టుఖర్చులదనం. దేశసేవప్రచురణలు 5/3 ఆర్‌టి, పంజాగుట్టకాలని, హైదరాబాదు-4కు వ్రాసి మీకోపుస్తకం వి.పి. పోష్టుగా పొందండి.

రోజులు కూరకోసం తిప్పలుండేవి కాదు. ముప్పావలా వడేస్తే గజమున్నర వన్నా పైన గజం గుడ్డొచ్చేది. హాయిమని రెండు రవికెలకి సరిపడేది.

మరిప్పుడో! పురటాలు చీకట్లో తొంగుడున్నాది. దీపం కొడిగట్టిపోతున్నాది. అర్థరాత్రేటి చెయ్యటా కీలుగానేదు ఆలోచనల్లోంచి బయటపడింది నూకాలమ్మ. ఉన్న మంచినూని కాస్తా ఒడిపేసి దీపం వెలిగిస్తే, అది సగం రాత్రి కాకుండానే కొండెక్కేటట్టున్నాది.

కొబ్బర్నూని కాయలో కూసింత తున్నట్టున్నాది. మళ్ళీ తడుముళ్ళాట మొదలెట్టింది నూకాలమ్మ.

చీకట్లో చంటిబిడ్డని పడకేసీడమే! అమ్మో! ఎన్ని మ్మూరుకుంతాదేటి! తల్లి నీసిల్లనీ పీకిపిసికీదూ.'

మరింక ఆలోచించలేక కొబ్బర్నూని కాయ ప్రమిదలోకి ఒంపింది....

డం డం...ప్పిప్పీ...

బయటేదో బాజాల చప్పుడు వినిపించిం దింతలో! హలో మైకు టెష్టింగ్ మైకు టెషింగ్... మైకు సెట్టు వెంకటేశం గొంతు కూడా వినిపించింది.

''ఓ అ మ్మెవరింట్లోనో పెళ్ళిలాగున్నది''... ఇక పాత సినీమా పాటలతో తెల్లవార్లు నిద్రుండదని నూకాలమ్మకి దిగులు పట్టుకుంది. దానికి సాయం ''డం డం...ప్పి ప్పీ'' లు పెరిగేయి. మైకు సెట్టు గరగరలు కూడా వినిపిస్తుంటే తలుపు తీసి బయటకొచ్చింది నూకాలమ్మ.

కళ్ళొక్కసారి జిగేల్ మన్నాయి. గుడారం ఆకారంలో అమర్చబడిన వైర్లనుంచి వేలాడుతూ రంగు రంగుల ఎలక్ట్రిసిటీ బల్బులు వెలుగుతున్నాయి. గుడారం మధ్యలో 'గద్దె' మీద పీటం అమర్చేరు. శిఖరంమీద పద్మాకారంలో ఉన్న బల్బులు వెలుగుతూ, ఆరుతూ వింత కాంతుల్ని వెదజల్లుతున్నాయి. క్షణం క్రితందాకా అంధకార బంధురంలాగ ఉన్న 'గుడెం' ఇప్పుడు వెలుగు తొడుగు ధరించింది.

'గంగాలమ్మతల్లి పండుగే వెంకటేశం?' క్షణానికి పూర్వం అనుభవించిన మానసిక క్లేశం మర్చిపోయి మైకు సెట్టు వెంకటేశాన్ని పలకరించింది నూకాలమ్మ.

''మరే, నూకాలప్పా'' లైట్ల కాంతిలో వెంకటేశం తొడిగిన చలి బనీను మెరుస్తూంది.


''పన్నెండున్నరకి సంగం పెద్దలొచ్చి 'అమ్మ'ని గద్దెక్కిస్తున్నారు. నన్నేమో నైటింగరేంజిమెంట్లన్నీ చూసేమన్నారు'.'

''ఆహా....''

''ఏ టింకా నిద్ర రేన్నేదా!''...వెంకటేశం ఒంటరిగా పని చేసి విసిగి ఉన్నాడు. మనిషి దొరకగానే మాటలు దొర్లించేస్తున్నాడు.

''నేదురా! ఇంట్లో చిట్టి, పిల్లా చీకట్లో తొంగుడున్నారు. దీపానికేమో నూన్నేదు...'' ఏదో చెప్పబోయింది నూకాలమ్మ.

''ఇంక నీకు నూనెందుకులే... పది రోజులపాటు గంగాలమ్మతల్లి దీపాలు నీ ఇంటి పక్కనే ఉంటాయిగా...''



నూకాలమ్మకి తళుక్కు నేదో ఆలోచనొచ్చింది. గుడిసెలో దూరి గడ్డికోసే కొడవలి వెదికింది. చిట్టి మంచానికి దగ్గరగా నేలకి నాలుగడుగుల ఎత్తున తడిక నలుచదరంగా కిటికీ వాటంలో 'కట్' చేసింది. బయటకొచ్చి కిటికీలోంచి తల్లి, పిల్ల ప్రశాంతంగా నిద్రపోవడం చూసింది. మళ్ళీ లోపలికెళ్ళి గొరిని తల్లికి దగ్గరగా జరిపి తనా పక్కనే ఒరిగి చూసింది. కిటికీలోంచి దేదీప్యమానంగా గంగాలమ్మతల్లి దీప తోరణాలు పలకరించేయి.

''అమ్మయ్య! పరవానేదు. గుంట దొకేల నేచినా దీపాల్పా పాడుకుంతది... ఎలాగో ఈ రాత్రి గడుస్తే రేపటి సంగతి గంగాలమ్మతల్లే ఉన్నాది'' అనుకుంది. మంచం తడిక వారగా జరిపి, పిల్లని కిటికీ వేపు పడుకోబెట్టి బొడ్డుమీద గుడ్డ కప్పింది.

తృప్తిగా వూపిరి పీల్చి తలుపు గడియ పెట్టి వచ్చి తన మంచంమీద ఒరిగింది. సగం రాత్రయిపోయినట్టుంది. బయట గంగాలమ్మ సంబరం. తాలింపు బాజాలు వినిపిస్తున్నాయి. కన్ను బలవంతంగా మూద్దామనుకుంది. కాని మళ్ళా ఇంతలోనే పాడు ఆలోచనలు. కొబ్బరి తడిక మట్టి పూత పెట్టిన గోడ కాబట్టి సులభంగా కొడవలితో కోసి కిటికీ తయారుచేసింది. కాని కిటికీకి వూచల్లా, తలుపుల్లా లేవుగదా! ఏ బావురు పిల్లి అయినా, ఏ పిచ్చి కుక్కయినా జొరబడి ఆముదం వాసన కొడుతున్న పసి గుడ్డని నోట కరుచుకుని వెళ్ళిపోతే... అమ్మయ్యో... ఇంకేమయినున్నాదా!

దబ్బున లేచి నడి మంచంమీద నిటారుగా కూచుంది, కళ్ళలో వత్తులు వేసుకుని తెల్లవార్లూ మేలుకొనుండి పిల్లను కాపాడాలి.'' మూతలు పడుతున్న కళ్ళు బలవంతంగా తెరుస్తూ...మూస్తూ... పక్కమీద ఒరుగుతూ... గబుక్కున లేచి కూచుంటూ కష్టపడుతున్న నూకాలమ్మని నిద్రపోనివ్వకుండా పాత మైకు సెట్టు గరగరలు, భజంత్రీ మేళంలో వాద్యగాళ్ళు సహకరించేరు. ఎప్పుడు కునికిందో మరి... కళ్ళు తెరచేసరికి భళ్ళున తెల్లారింది. చిట్టి లేచి, ఇంటెడు పనిచేసి, చంటిపిల్లకి నీళ్ళోసి, కాళ్ళమీద పడకేసుకుని సాంబ్రాణి పొగేస్తూంది.

నూకాలమ్మ ఉప్పు చిల్లరడబ్బుల్తో నూని, మిరపకాయలు, తాలింపు దినుసులు తెచ్చింది. తొరతొరగా వంట చేసేసింది. పిల్ల కింత పెట్టి తను తింది. మామూలు ప్రకారం 'టిపినీ' లో మిగిలిన అన్నం పెట్టి, గెంజిపోసి, ఇంత ఉప్పు కలిపింది. పుగతోటకి బయల్దేరేదల్లా ఆగి, రేకు దీపం బుడ్డి పట్టుకుని రంగనాయకమ్మగోరింటికి బయల్దేరింది.

రంగనాయకమ్మ గూడెంలోని 'సింగిల్ టీచర్' స్కూలులో పని చేస్తూంది. పెళ్ళి—సంసారం—పిల్లలు లేని నిస్వార్థ జీవి. ''లోలీయమ్స్ అండ్ ది లాస్ట్'' అంటే ఆవిడకి జాలి. అందరి అవసరాలకీ ఆదుకుంటూ పది మందినీ మంచి చేసుకుంటూ హాయిగా జీవిస్తూంది. నూకాలమ్మ గడప ఎక్కగానే ఆవిడ స్కూలుకి బయల్దేరుతున్నదల్లా ఆగిపోయింది.

''ఏం నూకాలమ్మా! ఇలా గొచ్చేవు?''

''అమ్మో బుడ్డెడు కిరస నూనుం తియ్యరా! నేను బేరను తోటల్లో పనయిపోయి ఇంటికొచ్చేటప్పటికి చీకటడిపోతనాది. గుంట దొక్కత్తీ చీకట్లో పసి గుడ్డుతో నుంటాది మాటలు మింగేసింది నూకాలమ్మ. ''పని లోంచి వచ్చేక బ్లాకులోనయినా ఒక లీటరు కిరసనూని కొని మీ కిచ్చేస్తానని చెప్పాలని ఆరాటపడింది. చెప్పలేక పోయింది.

''అది కాదు నూకాలమ్మా! నిన్న చవక డిపోలో కిరసనాయిలిచ్చేరుగా! నువు తెచ్చుకోలేదా?'' రంగనాయకమ్మ చెప్పులు విడిచి, హేండుబేగ్, గొడుగు మంచంమీద పడేసి గుమ్మంలో నిలబడ్డ నూకాలమ్మ చేతిలోంచి 'బుడ్డి' అందుకుంది. క్షణంలో నూనింపి తెచ్చి ఇచ్చింది.

''నిన్నటేల చిట్టి 'క్యూ' లో నిలబడ్డాదంతమ్మా! టయిమయిపోనాదన్నా డంతగవరాజు''

దిగులుగా మొహం పెట్టి బుడ్డి కోసం చెయ్యి జాపింది.

"మా గూడెం వాళ్ళంతా 'సంఘం' కట్టి గంగాలమ్మ పండగ లవీ చేస్తారు. గవర్రాజు అన్యాయాలు మాత్రం ఆరిక్కట్టలేరు. అయినా మా వార్డు రిజర్వుడు మెంబరు 'అప్పయ్యమ్మ'ని వోటేసి గెలిపించేరుగా! పదేళ్ళ నుంచీ పంచాయతీ బోర్డు పాలించేస్తోంది పాపం! మీరంతా కలిసి నిలదీసడగండి. ఆవిడేమైనా చేసి గవర్రాజు చేత మాకు సరుకు సరయిన ధర కిప్పిస్తుందేమో చూడండి."

గుక్క తిప్పకుండా చెప్పదల్చుకున్నది చెప్పేసి, చెప్పులు తొడుక్కుని, గదికి తాళం పెట్టి హొందు బాగూపు పంటూ స్కూలుకి బయల్దేరింది రంగనాయకమ్మ. ఆవిడంతే! వెన్నముద్దలాటి మనసు. గొడ్డలి పెట్టుల్లాంటి మాటలు. అవసరం అనుకుంటే ఎవర్నయినా ధిక్కరిస్తుంది. అసలా పేరులోనే అన్యాయం ఎదుర్కొనే శక్తి ఉందేమో!

బుడ్డి పట్టుకుని గుడిసెవు నడుస్తున్న నూకాలమ్మ కాళ్ళు అప్రయత్నంగా అప్పయ్యమ్మింటి వేపు నడిచేయి.

అప్పయ్యమ్మింట్లోనే ఉంది. ఎత్తరుగుమీదున్న నవారు మంచంమీద కూర్చుని దుబ్బు జుట్టు ఈరువ్వన్నితో ఈర్చుకుంటోంది. మధ్య మధ్య పాటుకు పాటుకు మంటూ కుక్కుతోంది ఈళ్ళని.

"వోక్కేకినావు" (వోట్లేసినారు). నోట్లో ఉన్న అడ్డపుగ చుట్టతీసి కింద పెట్టింది. అంతమాత్రాన నన్నేం జెయ్యమంతరు! నాను పంచాయతీ బోర్డు లెంబర్ని! ఆడు చవకదు కాణవు గవర్రాజు..."

పొంతనలేని మాటలు....

"అతగాడు నీ తమ్ముడే గందా! బీదా బిక్కీని పీడించక మా యనికుసింత చెప్పరాదా... నూకాలమ్మకి అప్పయ్యమ్మ దోరణి నచ్చలేదు. ఇప్పుడేమిటి! ఆమె తరపున కాన్వాసుచేసి మెంబర్ను చేసిన మర్నాటి నుంచీ నచ్చటంలేదు ఆమె దోరణి. కాని ఆమె జాతక మెలాంటిదో కాని అప్పయ్యమ్మ మెంబరయినప్పట్నుంచీ మళ్ళీ ఎలక్షన్లే జరగలేదు. స్థిరంగా పాతుకుపోయింది స్థానంలో.

"నాన్నేపి తింటాడా! నువ్వింటావా! అయినా ఆడిమీననాకేమదార్ట్ ఉంది! నా తమ్ముడయినంత మాత్రాన అణ్ణే నట్టపొమ్మని చెప్పగలనా. నీ తమ్ముడి కయితే నువు జెవుతావాంత!... అయినా ఆడీ మీన నా కదార్టి నే దన్నానుగా... పంచాయతీ బారికాడు డప్పు తిన్నగా కొట్టటం లేదంతే నాతో చెప్పు! ఆడి కేసు సూసుకుంతం! అయినా దేశమంత బాకులో సరుకు కొనుకుంతుంతే. నీకొక్కదానికే హోయిటులో కావాలంటే అవుతాదేటి?" ఒత్తు జుట్టులో పేరుకుపోయిన పేలు తెల్లటి తువ్వాలుమీద దువ్వి పోస్తూ కుక్కుతుంటే చూసి నూకాలమ్మ అసహ్యించుకుంది. గిరుక్కున వెనక్కి తిరిగింది. చక చక గుడిసె చేరింది.

"చిట్టీ! కిరసనాయిలు తీసుకో! నేను కుసింతాలీశం గావస్తే జాగర్త" కాంపు కెడుతున్న ఆఫీసరమ్మలాగ 'టిపిని' పట్టుకొని పుగతోట వేపు సాగింది నూకాలమ్మ.

పుగ తోటలో నీళ్ళు ప్రవహిస్తున్నాయి. చాక్లెట్ రంగు ఇసకమీద ఆరంగుళాల ఎత్తు ఎదిగిన పుగ మొక్కలు, లేత అరటాకు రంగు ఆకులతో చిరుగాలికి తలలు ఆడిస్తున్నాయి. అందరికంటె ముందు పనిలో దూరి ఆఖరుదాకా ఉండే నూకాలమ్మ తప్ప మరెవ్వరూ పనిలోకిరాలేదు. రైతు మోటరు వేసేడు. ఇంజను స్వచ్ఛమయిన పాతాళగంగను తోడిపోస్తుంటే ఆ జల తరంగిత ధ్వని తరంగాలు ఏదో తెలియని ఆహ్లాదం కలిగిస్తున్నాయి. నూకాలమ్మ వంగి పని చేస్తోంది. కష్ట జీవికి బాదే సుఖం.

పుగనారు వరసల మధ్యనుంచి పాములున్న పాముల్లాగా పారుతున్న నీటి బోదెలు పల్లం చేస్తోంది. గట్లు ఎత్తు చేస్తోంది. మధ్య మధ్య నిటారుగా నిలబడి నారు వరసల అందం తిలకిస్తోంది. నూకాలమ్మ నిన్నటి నుంచీ తనకి బాధ కలిగించిన విషయాలే మరిచిపోయి పనిచేస్తోంది. పనివాళ్ళు ఒక్కొక్కళ్ళే వస్తున్నారు. ఎవరి పని వాళ్ళు చూసుకుంటున్నారు. సడెన్‌గా ప్రవాహ వేగం తగ్గిపోయింది. ఏమిటా అని తలెత్తి చూసింది నూకాలమ్మ. కరెంటు పోయింది. ఇంజను చప్పు డాగిపోయింది. బోదెల్లో నీరు కొంచెం దూరం పాటు దూసుకు వెళ్ళి ఇసకలో

**INDU is film.**

**For the last three years, INDU'S been making the entire range of photographic products.**

**And is one of just six companies in the world which has the sophisticated technology to make photo-sensitised film...**

**That's what makes INDU so special.**

INDU Roll Film. INDU Bromide Paper. INDU Cine Positive. INDU Cine Sound Negative. INDU X-ray. INDU Medium Contrast Graphic Arts Film. INDU Diapositive. INDU Document Copying Paper.

Today. INDU can make it on its own—and make it better. Which is why we say with confidence INDU IS FILM.

INDU

**Hindustan Photo Films Mfg. Co. Ltd.**
(A Government of India Enterprise)
Indunagar,
Ootacamund 643 005

**Photo. Cine. X-ray.**



SAA/HPF/2153

